క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. వర్షాలకు నగరంలో నీటమునిగిన ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల వారికి ఇబ్బందులు ఏవైనా ఉంటే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికైనా విపత్కర పరిస్థితులు ఎదురైతే సాయం కోసం ఫోన్ నంబర్ 9849906486ను సంప్రదించాలని కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు.

అలరించిన సంగీత విభావరి



వేదికపై పాట పడుతున్న గాయకుడు

విజయనగరం టౌన్: స్థానిక ఘంటసాల స్మారక కళాపీఠంలో మంగళవారం రాత్రి జరిగిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులంతా అలనాటి మధుర గీతాలను ఆలపించి, వీక్షకులకు శ్రవణానందం కలిగించారు. కార్యక్రమంలో కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, సాయి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా



రహదారిపై బోల్తాపడిన కారు వద్ద పోలీసులు

భోగాపురం: స్థానిక ఆదర్శ పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఓ కారు బోల్తా పడినట్లు సీఐ దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. భార్యాభర్తలు తమ ఇద్దరు పిల్లలతో కలిసి కారులో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తుండగా భోగాపురం దగ్గరకు వచ్చేసరికి కారు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంలో భార్యకు తీవ్రగాయాలవ్వగా భర్త, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకుని ఘటన స్థలానికి వెళ్లామని, అప్పటికే క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. జేసీబీ సాయంతో కారును పక్కకు నెట్టి ట్రాఫిక్ అంతరాయం తొలగించామన్నారు.

పక్కాగా పౌష్టికాహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరంఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు, వస్తువులు పంపిణీ చేయాలని, తద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పక్కాగా అందించాలని జేసీ సేతుమాధవన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంగళవారం ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. ఐసీడీఎస్ పీవోలు తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్షుణ్నంగా తనిఖీ చేసి, అంగన్‌వాడీ కేంద్రాల కార్యాకలాపాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. రానున్న సమావేశానికి నివేదిక అందజేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.మురళీనాథ్, సివిల్ సప్లై డీఎం బి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా ప్రభావతి

విజయనగరం టౌన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షురాలిగా పలుకూరి ప్రభావతి ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేసి, సంఘ సభ్యులు ఆమెను అభినందించారు.

లాటరీ ద్వారా ఫ్రీ సీట్లు కేటాయింపు

పూసపాటిరేగ: విద్యాహక్కు చట్టం ప్రకారం మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు అందివ్వాల్సిన ఫ్రీ సీట్లు లాటరీ ద్వారా మంగళవారం కేటాయించారు. ఈ మేరకు ఎంఈవో బి.పాపినాయుడు విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రెండు విడతల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సీట్లు అందించామని, తొలుత విద్యార్థి ఇంటికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలల్లో సీట్లు ఇచ్చామని, ఇప్పుడు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వారికి విద్యాశాఖ ఆదేశాల మేరకు సీట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మూడో విడతలో ఒకటో తరగతిలో మొత్తం 31 మంది విద్యార్థులకు సీట్లు ఇచ్చామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా విద్యార్థులు కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుందన్నారు.



పాతబస్టాండ్ ప్రాంతంలోని జోరున కురుస్తున్న వర్షం

నగరం.. జలమయం!

విజయనగరం జలమయమైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం వినాయక చవితి నేపథ్యంలో జోరు వానలోనూ ఫుట్‌పాత్ వ్యాపారాలు కొనసాగాయి. వర్షాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా పూజాసామగ్రి కొనుగోళ్లకు ప్రజలు బారులుతీరారు. ఎంతైనా ఈ ఒక్కరోజే కదా వ్యాపారమని చిరువ్యాపారులు కూడా వర్షంలోనే అమ్మకాలు కొనసాగించారు.

–విజయనగరం



పాతబస్టాండ్ రోడ్డులో వర్షపునీటిలోనే అరటిపండ్ల వ్యాపారులు



గంటస్తంభం రోడ్డులో పూజాసామగ్రి కొనుగోళ్లకు గొడుగులు వేసుకుని మరీ వెళ్తున్న జనం



జలమయమైన పాతబస్టాండ్ రోడ్డులోని చిరువ్యాపారుల దుకాణాలు

బాండులిచ్చి బుకాయించడమేనా సుపరిపాలన?



బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

• 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు

విజయనగరం: ఎన్నికల హామీలు కచ్చితంగా అమలు చేస్తామని కూటమి నాయకులు ప్రజలకు బాండులిచ్చారని, ఇప్పుడు హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఇలా బాండులిచ్చి బుకాయించడమేనా సుపరిపాలన? అని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కెల్ల త్రినాథ్‌లు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణపురంలో మంగళవారం పర్యటించిన సదరు నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు సభ ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎన్నికల హామీలన్నీ అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు మేలు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుండా అరకొరగా మూడు, నాలుగు పథకాలు అందజేసి అన్నీ అమలు చేసేసినట్లు కూటమి నాయకులు సుపరిపాలనకు ఏడాది పేరిట కార్యక్రమం జరుపుకోవడం సిగ్గుచేటన్నారు.

మోసగించడం చంద్రబాబుకు అలవాటు..

మొదట్లో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఇప్పుడు మూడు ఇస్తున్నారని, తల్లికి వందనం కింద కింద ఏడాదికి ఒక్కో బిడ్డకు రూ.15 చొప్పున ఇస్తామని ఇప్పుడు రూ.13 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు ఇలా రకరకాలు అందించడం మోసం కాదా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పథకం కూడా చాలా మంది అర్హులకు ఇవ్వలేదని, ఉచిత బస్సు కూడా కొన్ని బస్సులకే పరిమితం చేసి నయవంచన చేశారని ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికలప్పుడు అమలు సాధ్యం కాని హామీలిచ్చి ఓట్లు దండుకుని ఆ తర్వాత వాటిని ఇవ్వకుండా జనాన్ని మోసం చేయడం చంద్రబాబుకు బాగా అలవాటు అయిపోయిందని దుయ్యబట్టారు. మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ తదితర పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని అడిగారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని, అప్పటి వరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్ల సత్తిరాజు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోండి

భోగాపురం: పంటపొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అలా చేస్తే పంటలు పాడవ్వకుండా ఉంటాయని ఉద్యానవన శాఖ అధికారి బి.ఉమాభరణి సూచించారు. ఇదే విషయమై ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్న ఉద్యానవన రైతులంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విరివిగా వర్షాలు కురుస్తున్నందున పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా కొబ్బరితోటలో నీటి నిల్వలు లేకుండా చేసి చెట్టు వద్ద మట్టిని ఎత్తుగా వేసుకోవాలని తెలిపారు. వేరు కుళ్లు కనిపిస్తే బోర్డెక్స్ మిశ్రమాన్ని వేర్లు దగ్గర వేయాలని చెప్పారు. అలాగే బొప్పాయి తోటలో కూడా నీటిని ఉంచకుండా చేసి మూడు గ్రాముల మెట్లాలెక్సిన్‌ని నీటిలో కలిపి మొదల్ల దగ్గర పోయాలన్నారు. అరటి తోటలో విరిగిన చెట్లు, రెండు పిలకలు వదిలేయాలన్నారు. నీటి ముంపులో రెండు రోజుల పాటు ఉన్న చెట్టు వద్ద 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్ వేసుకోవాలన్నారు. కూరగాయ పంటలకు ఆకుమచ్చ కాయ, కుళ్లు, బూజు, తెగుళ్లు రాకుండా లీటరు నీటికి 2.5 గ్రాముల ఎస్ఏఏఫ్ మందు కలిపి రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. పూలతోటలో ఆకుమచ్చ తెగులు నివారణకు 1 మిల్లీలీటరు ప్రొఫికోనజల్‌ను లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు స్ప్రే చేయాలని తెలిపారు.

• తొలిపూజకు సిద్ధం..



పూసపాటిరేగలో విక్రయానికి సిద్ధం చేసిన గణేశుని విగ్రహాలు



సీహెచ్ అగ్రహారంలో కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్ ప్రాంతం

వినాయక చవితికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ఉత్సవాలు ఆరంభం కానుండడంతో తొలిపూజకు అంతా సిద్ధం చేశారు. ఇప్పటికే ముస్తాబు చేసిన మండపాలకు గణేశుని విగ్రహాలు తరలించారు. మామిడితోరణాలు, రంగురంగుల జెండాల అలంకరణలో విద్యుత్‌కాంతుల నడుమ రూపుదిద్దుకున్న మండపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే పూజా ప్రాంగణాల్లోని మైక్‌సెట్‌ల ద్వారా వస్తున్న గణేశుని పాటలతో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం జరిగే పూజకు ఎటువంటి విఘ్నాలు తలెత్తకుండా ఉత్సవ కమిటీలు పకడ్బందీగా చర్యలు చేపట్టాయి.

– పూసపాటిరేగ

లక్ష్య సాధనకు ప్రణాళికతో చదవాలి


విజయనగరం అర్బన్: ఉన్నత స్థితిని కోరుకునే విద్యార్థులు లక్ష్య సాధనకు ఓ ప్రణాళికతో చదవాలని జోదా కన్సల్టింగ్ సంస్థ డైరెక్టర్ జీవనజ్యోతి ఓల్గా సూచించారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా 'నావిగేటింగ్ అవైలబుల్ రిసోర్సెస్ అండ్ ప్లాట్‌ఫాం వర్క్ ఫర్ యు' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముందు బంగారు భవిష్యత్‌కు లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ఆ తర్వాత వాటిని చేరుకోవడానికి చక్కని ప్రణాళికలు వేసుకోవాలని తెలిపారు. కృషి, పట్టుదల, చిత్తశుద్ధి, నిబద్ధత వంటి లక్షణాలు అలవర్చుకుంటే దేనినైనా సాధించడం సులభమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉన్నతమైన జీవనానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జీవనజ్యోతి ఓల్గా


గణితం మాస్టారు గీసిన గణపతులు













వినాయక చవితి పురస్కరించుకుని, గణితం మాస్టారు సిద్ధాంతం త్రినాథరావు గీసిన గణపతి చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పారసాం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన స్వతహాగా గణితం మాస్టారు కావడంతో గణితానికి సంబంధించి జ్యామితి, రేఖాగణితంలను ఆధారంగా చేసుకుని రూపొందించిన వినాయకుని ఆకారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

– విజయనగరం అర్బన్

సోలార్ విద్యుత్ యూనిట్ల లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరంఫోర్ట్: సోలార్ విద్యుత్ యూనిట్ల స్థాపనకు విద్యుత్ అధికారులకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జేసీ సేతుమాధవన్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఆదా అవుతుందని, ఈ పథకంపై అన్ని మండలాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా కోటి గృహాలకు సోలార్ పవర్ ప్లాంట్‌లు బిగించాలని పిలుపునిచ్చారని, ఈ లక్ష్యం చేరుకోవాలన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ పీడీ గండి మురళి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం టౌన్: స్థానిక యూత్ హాస్టల్‌లో డీబీఎస్‌యూ(దళిత బహుజన శ్రామిక యూనియన్) నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.పార్వతి(విజయనగరం), జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.పి.రాజు(గరివిడి), ఉపాధ్యక్షుడిగా కాగాన సంజీవి(బొబ్బిలి), జాయింట్ సెక్రటరీగా ఎన్.కళావతి, కోశాధికారిగా జి.రామలక్ష్మి, కమిటీ సభ్యులుగా గొటివాడ మంగమ్మ, గొల్లబాబు, గంట శివ, కె.లలిత, కిల్లాడ అప్పారావు, వి.అప్పలకొండ, సీర కనకమ్మ, నరసింహదొర, ఆర్.ఈశ్వరరావు ఎంపికయ్యారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం

నెల్లిమర్ల రూరల్: దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో మంగళవారం ఖండించారు. ఎన్నికల హామీల్లో బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఉన్న పింఛన్లలో కోత విధిస్తుండడం దుర్మార్గమన్నారు. ఎంతోమంది అర్హులైన దివ్యాంగుల పింఛన్లు ఎత్తివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, అదే జరిగితే అదే పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న వారి బతుకులు ఏం కావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు.

ద్రవరూప ఎరువులపై అవగాహన కల్పించండి

డెంకాడ: ద్రవరూప ఎరువులపై అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖరరావు సూచించారు. మండలంలోని మోపాడ సత్తిరాజు ఎంటర్‌ప్రైజస్, డెంకాడ, సాయికృష్ణ రైతుమిత్ర గ్రూప్ ఎరువుల షాపుల్లో ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వల బోర్డు ప్రదర్శించాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు అమ్మాలని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దారు రాజారావు, వ్యవసాయాధికారి సంగీత తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



విజయనగరం టౌన్: మట్టి గణేశుని ప్రతిమలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద జిల్లా ఆర్యవైశ్య సంఘం(అర్బన్), జిల్లా అవోపా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విచ్చేసి, ప్రజలకు విగ్రహాలు అందజేశారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే పూజలకు వాడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: వినాయక చవితి పురస్కరించుకుని, నగరంలో చిన్నశ్రీను సోల్జర్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ మంగళవారం చేపట్టారు. చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర చేతులమీదుగా మట్టి ప్రతిమలతో పాటు పూజాసామగ్రి, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో చిన్నశ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేట రైస్‌మిల్లు జంక్షన్ వద్ద ఆ గ్రామ సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు పంచిపెట్టారు. బుధవారం వినాయక చవితి సందర్భంగా పూజకు అవసరమైన ప్రతిమలు అందజేశామని సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.కల్యాణ్ చక్రవర్తి, అధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: మట్టి ప్రతిమల పంపిణీలో చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

భోగాపురం: మండలంలోని ముంజేరు, రామచంద్రపేట గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు, పనిచేస్తున్న ఉపాధ్యాయులకు విశ్రాంత ఉపాధ్యాయుడు భోగాపురపు సూరిబాబు ఆధ్వర్యంలో ముంజేరు గ్రామానికి చెందిన నాళం వెంకట శ్రీధర్‌కుమార్ మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు.

ఘనంగా మదర్ థెరీసా జయంతి



విజయనగరం టౌన్: మదర్ థెరీసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్ పట్నాయక్ తదితరులు



విజయనగరం క్రైమ్: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం టౌన్: స్థానిక అయ్యన్నపేట జంక్షన్‌లోని మదర్ థెరీసా సేవా సంఘం ఆధ్వర్యంలో మదర్ థెరీసా జయంతి, బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్..మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె దేశంలోని దీనులకు అందజేసిన సేవలను కొనియాడారు.

విజయనగరం క్రైమ్: స్థానిక సీబీ కాలనీలోని మదర్ థెరీసా క్లబ్‌లో జరిగిన మదర్ థెరీసా జయంతికి ముఖ్య అతిథిగా ఎస్పీ వకుల్ జిందల్ హాజరై, మదర్ థెరీసా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత ఇదే క్లబ్‌లో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఎస్పీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

మాతృభాష..సజీవ సమాజ దర్పణం

విజయనగరం టౌన్: నగరంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవం నేపథ్యంలో ముందస్తుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం చేపట్టారు. వర్సిటీ ఉపకులపతి తంత్రవాహి శ్రీనివాసన్ ఈ కార్యక్రమంలో పాల్గొని మన మాతృభాష అయిన తెలుగు భాష గొప్పదనం వివరించారు. భాష మాధ్యమం మాత్రమే కాదని అది జాతి సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, తెలుగు భాష సజీవ సమాజ దర్పణమన్నారు. మాతృభాషే మన అస్థిత్వం, ఘనమైన ఈ తెలుగు భాషను భావి తరాలకు అందేలా కాపాడుకోవాలన్నారు. అనంతరం ఉపకులపతిని సన్మానించారు. కార్యక్రమంలో డీన్ శరత్‌చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఉపకులపతి శ్రీనివాస్ తదితరులు